WEEKEND ANALYSIS
వీకెండ్ అనాలసిస్

# ఎదురులేని రేవంత్

**మునిసిపల్ ఎన్నికల్లో సంచలన విజయాలతో కాంగ్రెస్ ప్రత్యర్ధి బీఆర్ఎస్, బీజేపీలకు ఊహించని షాక్ నిచ్చింది. పట్టణాల్లో కాంగ్రెస్ దూసుకుపోతూ ఆధిపత్యాన్ని కట్టిపడేస్తుండగా, ఎన్నికల వ్యూహాల్లో సీఎం రేవంత్ రెడ్డి చూపిస్తున్న చాణక్యం చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంత పట్టుదలతో వ్యవహరిస్తారని, మంత్రులు ఇంత కసిగా.. జట్టుగా పనిచేస్తారని ప్రత్యర్థులు ఊహించలేదు. సందర్భం వస్తే కాంగ్రెస్ క్యాడర్ అంతా ఏకమై ఎలా పనిచేస్తుందో మునిసిపల్ ఎన్నికలు మరోసారి రుజువుచేశాయి. టీమ్ తెలంగాణ పనితీరుపై కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. జూన్‌లోపే పెండింగ్ లో ఉన్న పరిషత్, గ్రేటర్ హైదరాబాద్, ఇతర కార్పోరేషన్ల ఎన్నికలు పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిసైడ్ అయినట్లుగా కనబడుతోంది. ఇదే సమయంలో వరుస ఎన్నికల్లో బీఆర్ఎస్-బీజేపీ బలం క్షీణిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మూసీ ప్రక్షాళన, గాంధీ సరోవర్ ప్రాజెక్టు హైదరాబాద్ రాజకీయాల్లో గేమ్ ఛేంజర్ అవుతుందనే చర్చ జరుగుతోంది. జీహెచ్ఎంసి విభజనపై సీఎం పక్కా లెక్కలతో, ముందుచూపుతో అడుగులు వేస్తున్నారు. తెలంగాణ బాటలో ఏపీ కూడా పయనిస్తోంది. ఏపీలో స్థానిక ఎన్నికల నగారా త్వరలోనే మోగబోతున్నది.**

**- తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్- మహా పత్రికల సీఈవో, సీనియర్ జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**




తెలంగాణ రాజకీయాల్లో తాజా మునిసిపల్ ఎన్నికలు ఒక స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చాయి . పట్టణ ఓటరు మూడ్ మారుతోంది, నాయకత్వం ప్రభావం చూపుతోంది, వ్యూహం విజయం సాధిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలు కేవలం స్థానిక ఫలితాలు కాదు; అవి రాష్ట్ర రాజకీయ దిశను సూచించే సూచికలు. మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచాయి. పట్టణ ప్రాంతాల్లో బీఆర్ఎస్, బీజేపీలకు బలమైన స్థావరాలున్నాయని భావించినప్పటికీ, ఫలితాలు మాత్రం విభిన్న చిత్రాన్ని చూపించాయి. "పట్టణ ఓటరు ప్రగతిని కోరుకుంటాడు, వాగ్దానాలను కాదు" ఈ భావన ఈ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించింది. రేవంత్ రెడ్డి ఎన్నికల వ్యూహంలో చూపించిన చాణక్యం చర్చనీయాంశమైంది. అభ్యర్థుల ఎంపికలో స్థానిక సమీకరణాలు, కుల-వర్గ సమతుల్యత, యువతకు అవకాశాలు ఇవన్నీ సమన్వయంతో అమలయ్యాయి. ముఖ్యమంత్రి తీసుకొచ్చిన బీసీ రిజర్వేషన్ల అజెండా అధికారికంగా అమలుచేయడానికి మించి అమలైపోయింది.

**'టీమ్ తెలంగాణ' – సమన్వయం, కసి, కట్టుదిట్టమైన కార్యాచరణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గంతో కలిసి ఒక జట్టుగా పనిచేసిన తీరు ఈ విజయానికి ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు."ఛాలెంజ్ వస్తే కాంగ్రెస్ క్యాడర్ ఏకమై ఎలా పనిచేస్తుందో మునిసిపల్ ఎన్నికలు మరోసారి రుజువుచేశాయి"



అని రాజకీయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తెలంగాణ టీమ్ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు నేతలతో నిర్వహించిన మీటింగ్ ద్వారా స్పష్టమైంది. దేశంలో తెలంగాణ పాలనకు, పార్టీ నిర్వహణకు మంచి మార్కులు పడుతున్నాయి. ఇది రాష్ట్ర కాంగ్రెస్‌కు మరింత ఉత్సాహాన్నిచ్చింది. ఈ నేపథ్యంలోనే జూన్‌లోపే పెండింగ్‌లో ఉన్న పరిషత్, గ్రేటర్ హైదరాబాద్, ఇతర కార్పోరేషన్ల ఎన్నికలు పూర్తిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పించినట్లు కనిపిస్తోంది. ఇది రాజకీయంగా కీలక నిర్ణయం.

**ముందున్న సవాల్**

జీహెచ్ఎంసి విభజన అంశంపై సీఎం ముందు చూపుతో అడుగులు వేస్తున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. మూసీ ప్రక్షాళన, గాంధీ సరోవర్ వంటి ప్రాజెక్టులు హైదరాబాద్ రాజకీయాల్లో 'గేమ్ ఛేంజర్' అవుతాయనే చర్చ సాగుతోంది. గాంధీసరోవర్ ప్రాజెక్టుకు సంబంధించి జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్లతో చర్చ మొదలవగా, ఈ అంశాన్ని ప్రభుత్వం సున్నితంగా పరిష్కరించడంపైనే మూసీ ప్రాజెక్టు సేఫ్ గా పట్టాలెక్కడం ఆధారపడి ఉంటుంది. "అభివృద్ధి అనే ఆయుధంతోనే రాజకీయ యుద్ధం గెలవాలి" అని సీఎం పట్టుదలగా ఉన్నట్లు కనబడుతోంది. మూసీ ప్రక్షాళనతో తన మార్కు చూపాలని సీఎం రేవంత్ పట్టుదలగా ఉన్నారు.

**బీఆర్ఎస్ – బీజేపీ బలం క్షీణత**

వరుస ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఆశించిన ఫలితాలు రాలేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటు శాతం తగ్గుదల ఆ పార్టీలకు ఆందోళన కర అంశం. బీఆర్ఎస్‌కు అధికార వ్యతిరేకత, బీజేపీకి స్థానిక స్థాయిలో బలహీన నిర్మాణం ఇవి కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితులను సృష్టించాయి. "రాజకీయాల్లో శూన్యం ఉండదు. ఒకరి బలహీనత మరొకరికి అవకాశమవుతుంది" —— ఈ సూత్రం ప్రస్తుతం తెలంగాణలో అమలవుతున్నట్లు కనిపిస్తోంది.

**తెలంగాణ బాటలో ఏపీ**

తెలంగాణలో స్థానిక ఎన్నికల జోష్ కొనసాగుతుండగా, ఆంధ్రప్రదేశ్‌లో కూడా స్థానిక ఎన్నికల నగారా మోగబోతున్న సంకేతాలు ఉన్నాయి. తెలంగాణలో అమలవుతున్న వ్యూహాలను ఏపీ రాజకీయ పార్టీలు గమనిస్తున్నాయి. ఏపీ సర్కారు స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అధ్యయనానికి ఓ డెడికేటెడ్ కమిటీని వేసింది. తెలంగాణ తరహాలోనే రిజర్వేషన్ల సమస్యలను పరిష్కరించుకుంటూ ఏపీ సర్కారు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. చంద్రబాబు పాలనపై ఉన్నపట్టు రీత్యా స్థానిక ఎన్నికల విషయంలో సమయానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నారు. త్వరిత నిర్ణయాలు - ఎన్నికల ప్రకటనల నుంచి అభ్యర్థుల ఎంపిక వరకు వేగవంతమైన నిర్ణయాలు రేవంత్ శైలి కాగా, తెలంగాణలో గ్రామపంచాయతీ, మునిసిపల్ ఎన్నికలు ఫటాఫట్ జరిపించేశారు. ఇపుడు ముందున్న సవాళ్ళు పరిషత్, గ్రేటర్ ఎన్నికలు. ఇవి కూడా సమ్మర్ లోగా కంప్లీట్ చేసే అవకాశాలు కనబడుతున్నాయి. మునిసిపల్ ఎన్నికల ఫలితాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయి . రేవంత్ రెడ్డి రాజకీయాల్లో దూకుడుగా, వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. అయితే ఇది కేవలం ఆరంభమేనా? లేక దీర్ఘకాల ఆధిపత్యానికి బాటవేసే అడుగా? అన్నది రాబోయే గ్రేటర్ హైదరాబాద్, పరిషత్ ఎన్నికలు తేల్చనున్నాయి. "విజయం సాధించడం కంటే, దాన్ని నిలబెట్టుకోవడమే అసలైన సవాల్" ఇప్పుడు కాంగ్రెస్ ముందున్న పరీక్ష ఇదే.

> **మునిసిపల్ ఎన్నికల్లో సంచలన విజయాలతో కాంగ్రెస్ ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలకు ఊహించని షాక్ నిచ్చింది. పట్టణాల్లో కాంగ్రెస్ దూసుకుపోతూ ఆధిపత్యాన్నిచాటగా, ఎన్నికల వ్యూహాల్లో సీఎం రేవంత్ రెడ్డి చూపిస్తున్న చాణక్యం చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంత పట్టుదలతో వ్యవహరిస్తారని, మంత్రులు ఇంత కసిగా.. జట్టుగా పనిచేస్తారని ప్రత్యర్థులు ఊహించలేదు. సందర్భం వస్తే కాంగ్రెస్ క్యాడర్ అంతా ఏకమై ఎలా పనిచేస్తుందో మునిసిపల్ ఎన్నికలు మరోసారి రుజువుచేశాయి.**

> **తెలంగాణ రాజకీయాల్లో తాజా మునిసిపల్ ఎన్నికలు ఒక స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చాయి . పట్టణ ఓటరు మూడ్ మారుతోంది, నాయకత్వం ప్రభావం చూపుతోంది, వ్యూహం విజయం సాధిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయాలు కేవలం స్థానిక ఫలితాలు కాదు; అవి రాష్ట్ర రాజకీయ దిశను సూచించే సూచికలు.**

> **"అభివృద్ధి అనే ఆయుధంతోనే రాజకీయ యుద్ధం గెలవాలి" అని సీఎం పట్టుదలగా ఉన్నట్లు కనబడుతోంది. మూసీ ప్రక్షాళనతో తన మార్కు చూపాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. .**

> **వరుస ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఆశించిన ఫలితాలు రాలేదు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఓటు శాతం తగ్గుదల ఆ పార్టీలకు ఆందోళనకర అంశం. బీఆర్ఎస్‌కు అధికార వ్యతిరేకత, బీజేపీకి స్థానిక స్థాయిలో బలహీన నిర్మాణం ఇవి కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితులను సృష్టించాయి. "రాజకీయాల్లో శూన్యం ఉండదు. ఒకరి బలహీనత మరొకరికి అవకాశమవుతుంది" —— ఈ సూత్రం ప్రస్తుతం తెలంగాణలో అమలవుతున్నట్లు కనిపిస్తోంది.**

> **మునిసిపల్ ఎన్నికల ఫలితాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయి . రేవంత్ రెడ్డి రాజకీయాల్లో దూకుడుగా, వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. అయితే ఇది కేవలం ఆరంభమేనా? లేక దీర్ఘకాల ఆధిపత్యానికి బాటవేసే అడుగా? అన్నది రాబోయే గ్రేటర్ హైదరాబాద్, పరిషత్ ఎన్నికలు తేల్చనున్నాయి.**

# నరవణే పుస్తకం: భయమెందుకు?

భారత సైన్య మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం ఇంకా అధికారికంగా మార్కెట్‌లోకి రాకముందే దేశ రాజకీయాల్లో చర్చకు కేంద్రబిందువైంది. సాధారణంగా ఒక పుస్తకం విడుదలయ్యాక దానిపై విమర్శలు, ప్రశంసలు వినిపిస్తాయి. కానీ ఇక్కడ పుస్తకం వెలువడకముందే ఆందోళన, ప్రతిస్పందన, పోలీసు విచారణల వరకూ వెళ్ళిన పరిణామాలు ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. అసలు భయపడేది ఎవరు? ఎందుకు?

## వివాదానికి కారణం ఏమిటి?

2020లో చైనా సరిహద్దులో గల్వాన్ లోయ ఘటన దేశాన్ని కలచివేసింది. 20 మంది భారత జవాన్లు అమరులయ్యారు. ఆ సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ "మన భూభాగంలోకి ఎవరూ చొరబడలేదు" అని చేసిన ప్రకటనపై అప్పటి నుంచే చర్చ సాగింది. ఇప్పుడు నరవణే పుస్తకంలో రెచిన్ లా ప్రాంతంలో జరిగిన పరిణామాలు, ఆ సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాలేదన్న వ్యాఖ్యలు ఉన్నాయనే సమాచారం వెలుగులోకి రావడంతో వివాదం ముదిరింది. రక్షణ మంత్రిత్వ శాఖ ఈ పుస్తకానికి ఇంకా అనుమతి ఇవ్వలేదని తెలిపింది. ప్రచురణ కర్త పెంగ్విన్ రాండమ్ హౌస్ "అధికారిక కాపీలు విడుదల కాలేదు" అని స్పష్టం చేసింది. అయితే పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హార్డ్‌బౌండ్ కాపీని చూపించడం, ఢిల్లీ పోలీసులు లీకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వంటి పరిణామాలు మరింత సందేహాలకు తావిస్తున్నాయి.

## పుస్తకం ఎలా వెలువడుతుంది?

సాధారణ పాఠకుడికి తెలియని అంశం ఏమిటంటే—ఒక పుస్తకం రచన పూర్తవడం అంటే అది వెంటనే దుకాణాల్లోకి రాదు. మాన్యుస్క్రిప్ట్ సమర్పణ, స్ట్రక్చరల్ ఎడిటింగ్, కాపీ ఎడిటింగ్, ప్రూఫ్ రీడింగ్, లీగల్ వెట్టింగ్ వంటి అనేక దశలు ఉంటాయి. ముఖ్యంగా సైన్యం, జాతీయ భద్రతకు సంబంధించిన పుస్తకాలకు అదనంగా ప్రభుత్వ అనుమతి అవసరం అవుతుంది. అన్ని సవరణలు పూర్తయిన తర్వాత ప్రచురణకర్తలు "నాట్ ఫర్ సేల్" గుర్తుతో కొద్ది ప్రూఫ్ కాపీలు ముద్రిస్తారు. ఇవి సమీక్షకులు, మీడియా ప్రతినిధులకు పంపుతారు. ఈ దశలోనే ప్రీఆర్డర్ లింక్‌లు కూడా ఆన్‌లైన్‌లో కనిపించవచ్చు. కాబట్టి పుస్తకం ఇంకా అధికారికంగా విడుదల కాలేదన్నా, కొన్ని కాపీలు చలామణిలో ఉండటం అసాధారణం కాదు.

## భద్రతా కారణాలా? రాజకీయ అసౌకర్యమా?

దేశ భద్రతకు సంబంధించిన అంశాలపై జాగ్రత్త అవసరమే. కానీ ప్రశ్నల్ని పూర్తిగా అణచివేయడం ప్రజాస్వామ్యానికి అనుకూలం కాదు. ఒక మాజీ సైన్యాధిపతి తన అనుభవాలను రాయడం సహజమే. అతను వెల్లడించిన విషయాల్లో వాస్తవాలు ఉంటే, వాటిపై చర్చ జరగాలి. అవసరమైతే స్పష్టీకరణ ఇవ్వాలి. కానీ పుస్తకం వెలువడకముందే దాన్ని "ఫేక్"గా చిత్రీకరించడం లేదా విచారణలతో ముందుకు రావడం అనుమానాలకు దారి తీస్తుంది. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వంటి ఆపరేషన్లను రాజకీయ వేదికలపై ప్రచార సాధనాలుగా వినియోగించిన సందర్భాలు ప్రజలు చూశారు. అప్పుడు సైన్యం విజయాలను రాజకీయంగా వినియోగించడం సరైనదైతే, ఇప్పుడు అదే సైన్యానికి చెందిన మాజీ చీఫ్ వ్యాఖ్యలు ఎందుకు అసౌకర్యంగా మారాయి? విజయాలు తమవైతే, బాధ్యతలు కూడా తమవే కదా? ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ ప్రశ్నల వేదిక. ప్రతిపక్షం ప్రశ్నించడం సహజం. ప్రభుత్వం సమాధానం ఇవ్వడం బాధ్యత. ప్రధానమంత్రి స్వయంగా సభలో హాజరై వివరణ ఇవ్వడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి సంకేతం. ప్రశ్నించిన వారినే విమర్శించడం, దృష్టి మళ్లించడం ప్రజాస్వామ్య ఆరోగ్యానికి మంచిది కాదు. 1962 చైనా యుద్ధం తర్వాత కూడా దేశంలో విచారణలు జరిగాయి. హెండర్సన్ బ్రూక్స్ నివేదికపై చర్చలు జరిగాయి. తప్పులను పరిశీలించడం దేశద్రోహం కాదు. అది బాధ్యతాయుత నాయకత్వ లక్షణం. ప్రముఖ ప్రచురణ సంస్థలు పుస్తకాలను ముద్రించే ముందు లీగల్ వెట్టింగ్ చేస్తాయి. అపవాదులు, వివాదాస్పద వ్యాఖ్యలు ఉంటే మార్పులు సూచిస్తాయి. "Corrected Reading Copy" సిద్ధమైన తర్వాతే తుది ముద్రణ జరుగుతుంది. కాబట్టి ప్రభుత్వం భావిస్తే, అవసరమైన మార్పులు సూచించవచ్చు. కానీ పూర్తి అడ్డంకులు సృష్టించడం కంటే పారదర్శక ప్రక్రియను అనుసరించడం మంచిది. అగ్నిపథ్ పథకం వంటి అంశాలపై కూడా మాజీ సైన్యాధిపతి అభిప్రాయాలు వెలువడితే, అది ఆరోగ్యకరమైన చర్చకు దారి తీస్తుంది. సైన్యం నిర్మాణం, దీర్ఘకాలిక వ్యూహాలు వంటి విషయాల్లో విభిన్న అభిప్రాయాలు వినిపించడం సహజం. వాటిని దేశద్రోహంగా ముద్రించడం సరికాదు.

## భయమెందుకు?


ఈ వివాదం అసలు ఒక పెద్ద ప్రశ్నను ముందుకు తెస్తోంది. భయపడేది సత్యాన్నేనా? ఒక పుస్తకం వెలువడితే ప్రభుత్వం ఇమేజ్ దెబ్బతింటుందనే ఆందోళన ఉంటే, అది బలహీనత సంకేతం. నిజంగా వాస్తవాలు తమవైపు ఉంటే, పుస్తకం విడుదలకు అనుమతి ఇచ్చి ప్రజల తీర్పుకు వదిలేయవచ్చు. దేశానికి బలమైన సైన్యం అవసరం. అలాగే బలమైన ప్రజాస్వామ్యం కూడా అవసరం. ఈ రెండూ పరస్పరం విరుద్ధాలు కావు. సైనికుల త్యాగాలను గౌరవించడం అంటే వారి నాయకత్వ అనుభవాలను వినడం కూడా అదే స్థాయిలో అవసరం. నరవణే పుస్తకం వెలువడినా, వెలువడకపోయినా, ప్రజల్లో ఉన్న ఆసక్తి తగ్గదు. ప్రశ్నలు నిలిచే ఉంటాయి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నల్ని అణచివేయడం సాధ్యం కాదు. ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. భద్రతా కారణాలుంటే వివరించాలి. లేకపోతే పారదర్శకంగా అనుమతి ఇచ్చి పుస్తకాన్ని విడుదల చేయాలి. ప్రజాస్వామ్యంలో భయం కాదు బాధ్యతే నిలిచేది. సత్యం ఎప్పటికైనా వెలుగులోకి వస్తుంది. దాన్ని అడ్డుకోవడం కంటే, ఎదుర్కోవడం దేశానికి మేలు.



**- అమరవాజీ నాగరాజు**
**టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ**

> **దేశ భద్రతకు సంబంధించిన అంశాలపై జాగ్రత్త అవసరమే. కానీ ప్రశ్నల్ని పూర్తిగా అణచివేయడం ప్రజాస్వామ్యానికి అనుకూలం కాదు. ఒక మాజీ సైన్యాధిపతి తన అనుభవాలను రాయడం సహజమే. అతను వెల్లడించిన విషయాల్లో వాస్తవాలు ఉంటే, వాటిపై చర్చ జరగాలి. అవసరమైతే స్పష్టీకరణ ఇవ్వాలి. కానీ పుస్తకం వెలువడకముందే దాన్ని "ఫేక్"గా చిత్రీకరించడం లేదా విచారణలతో ముందుకు రావడం అనుమానాలకు దారి తీస్తుంది.**

> **దేశానికి బలమైన సైన్యం అవసరం. అలాగే బలమైన ప్రజాస్వామ్యం కూడా అవసరం. ఈ రెండూ పరస్పరం విరుద్ధాలు కావు. సైనికుల త్యాగాలను గౌరవించడం అంటే వారి నాయకత్వ అనుభవాలను వినడం కూడా అదే స్థాయిలో అవసరం. నరవణే పుస్తకం వెలువడినా, వెలువడకపోయినా,ప్రజల్లో ఉన్న ఆసక్తి తగ్గదు. ప్రశ్నలు నిలిచే ఉంటాయి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నల్ని అణచివేయడం సాధ్యం కాదు. ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.**






# ఆంత్రోపిక్ మరో సంచలనం..
## రూ.90 వేల కోట్లు ఆవిరి!

అమెరికా ఆధారిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆంత్రోపిక్ మరోసారి మార్కెట్లలో సంచలనం సృష్టించింది. సంస్థ తన ఏఐ ప్లాట్‌ఫామ్ క్లాడ్)లో కొత్తగా ప్రవేశపెట్టిన "క్లాడ్ కోడ్ సెక్యూరిటీ" ఫీచర్ ప్రభావంతో గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ రంగంలో భారీ కలకలం రేగింది. ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ప్రముఖ సైబర్ భద్రతా సంస్థల షేర్లు 5% నుంచి 9% వరకు క్షీణించగా, మార్కెట్ విలువలో దాదాపు 10 బిలియన్ డాలర్లు (రూ.90 వేల కోట్ల వరకు) ఆవిరైనట్లు అంచనాలు సూచిస్తున్నాయి.

**ఏమిటీ క్లాడ్ కోడ్ సెక్యూరిటీ?**

"క్లాడ్ కోడ్ సెక్యూరిటీ" అనేది క్లాడ్ ఏఐ ప్లాట్‌ఫామ్‌లో విలీనం చేసిన ఆధునిక భద్రతా సామర్థ్యం. ఇది సాఫ్ట్‌వేర్ కోడ్ బేస్‌లను స్కాన్ చేసి లోపాలను గుర్తించడంతో పాటు, వాటికి లక్ష్యిత పరిష్కారాలను సూచిస్తుంది. కోడింగ్ దశలోనే భద్రతా లోపాలను గుర్తించి సరిచేయడానికి డెవలపర్లకు ఇది సహాయపడుతుంది. సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ సాధనం భారీ స్థాయిలో కోడ్‌ను విశ్లేషించి, బలహీనతలను గుర్తించి, మానవ సమీక్ష కోసం ప్యాచ్‌లను సూచించగలదు. ప్రస్తుతం ఇది ఎంటర్‌ప్రైజ్ కస్టమర్లు, ఓపెన్ సోర్స్ ప్రాజెక్టుల నిర్వాహకులకు పరిమిత రీసెర్చ్ ప్రివ్యూగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

**ఏ స్టాక్స్ దెబ్బతిన్నాయంటే..**

ఆంత్రోపిక్ ప్రకటన తర్వాత ప్రధాన సైబర్ సెక్యూరిటీ కంపెనీల్లో గణనీయమైన అమ్మకపు ఒత్తిడి కనిపించింది. క్రౌడ్‌స్ట్రయిక్ షేర్లు సుమారు 8% పడిపోయాయి. ఓక్టా స్టాక్ 9% పైగా క్షీణించింది. క్లౌడ్‌ఫ్లేర్ 7-8% మధ్య తగ్గింది. జెడ్‌స్కేలర్ గణనీయమైన నష్టాలను నమోదు చేసింది. అలాగే గిట్‌ల్యాబ్, జేఫ్రాడ్ షేర్ల కూడా భారీ క్షీణతను చవిచూశాయి. ఇక సైబర్ సెక్యూరిటీ రంగాన్ని ట్రాక్ చేసే గ్లోబల్ ఎక్స్ సైబర్‌సెక్యూరిటీ ఈటీఎఫ్ (Global X Cybersecurity ETF) కూడా దాదాపు 5% పడిపోయి, 2023 నవంబర్ తర్వాతి కనిష్ట స్థాయికి చేరింది.

**మార్కెట్ ఎందుకు షేక్ అయిందంటే..**

సైబర్ సెక్యూరిటీ సంస్థలు సాధారణంగా లోపాల గుర్తింపు, ముప్పుల పర్యవేక్షణ, డిజిటల్ మౌలిక సదుపాయాల రక్షణ వంటి సేవలను అందిస్తాయి. ఈ విభాగంలో లోపాల గుర్తింపు కీలక అంశం. ఆంత్రోపిక్ ప్రవేశపెట్టిన ఈ ఏఐఆధారిత ఫీచర్ కోడ్ దశలోనే లోపాలను గుర్తించి పరిష్కారాలను సూచించడం ద్వారా సాంప్రదాయ భద్రతా సాధనాలకు సవాలు విసిరినట్టైంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి వర్క్‌ఫ్లోలోనే భద్రతా తనిఖీలు ఆటోమేటిక్ కావడం మార్కెట్ ఆందోళనకు కారణమైంది.




# ఇంటి బయట ఫర్నీచర్.. ఇదే కొత్త ట్రెండ్!

ఎండ, వాన, చలి నుంచి రక్షణ కల్పించే సాధారణ ఇళ్లకు కాలం చెల్లింది. ఉన్నంతలో ప్రతి ఒక్కరూ తమ పొదరింటిని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకోవాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఖర్చుకు ఏమాత్రం వెనకాడట్లేదు. ఈక్రమంలోనే ఇంటి లోపల కాదు ఇంటి బయటి ప్రదేశాల్లోనూ ఇంటీరియర్ డిజైనింగ్‌కు ప్రాధాన్యత పెరిగింది. మెట్రో నగరాలలో పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణం కొంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే అని చెప్పాలి. ఎందుకంటే నగరాలలో భూముల ధరలు రూ.కోట్లలో ఉంటాయి.. గ్రీనరీకి స్థల కేటాయింపులు తక్కువే. దీన్ని లక్ష్యంగా చేసుకునే నిర్మాణ సంస్థలు పచ్చదనానికి ప్రాధాన్యత ఇస్తూ గ్రీనరీ హోమ్స్‌ను నిర్మిస్తున్నాయి. విశ్రాంతి, ప్రశాంతత, ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించే గార్డెన్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో గార్డెన్ ఫర్నీచర్‌కు మార్కెట్‌లో ఆదరణ పెరిగింది.

**ఉన్నంతలో ఉన్నతంగా..**

మారుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలు, వినూత్న డిజైన్లతో భారత ఔట్ డోర్ ఫర్నీచర్ మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. పరిమిత స్థలంలో అందంగా, ఆకర్షణీయంగా ఒద్దికైపోవడమే ఈ గార్డెన్ ఫర్నీచర్ ప్రత్యేకత. వినియోగంలో సౌకర్యం, సౌలభ్యంతో పాటు అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ, ఎక్కువ కాలం మన్నికగా నిలుస్తుండటంతో కస్టమర్ల నుంచి ఆదరణ పెరుగుతోంది. రీసైకిల్ చేసిన కలప, వెదురు, తాటి చెట్ల నుంచి తయారయ్యే రట్టన్, గ్లాస్, ప్లాస్టిక్, సింథటిక్ ఫైబర్, లోహ మిశ్రమం వంటి పర్యావరణ అనుకూలమైన, అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకునే ఉత్పత్తులతో వీటిని తయారు చేస్తారు.

**నచ్చిన రంగు, ఆకృతి..**

కొనుగోలుదారుల అభిరుచులకు అనుగుణంగా నచ్చిన రంగు, ఆకృతి, డిజైన్‌లలో ఈ గార్డెన్ ఫర్నీచర్ అందుబాటులో ఉన్నాయి. ఫోల్డబుల్ కుర్చీలు, సోఫాలు, డైనింగ్, కాఫీ టేబుల్స్, కాంపాక్ట్ యూనిట్లు, బార్ లాంజ్‌లు వంటివి ఉంటాయి. చూపరులకు ఆహ్లాదకరంగా, ఆనందంగా ఉంటుంది. గుండ్రంగా, చతురస్రాకారం, వంపు తిరిగిన, నక్షత్రం, గొడుగు, కోడి గుడ్డు ఆకారంలో ఇలా మనకు నచ్చిన ఆకృతిలో ఎంపిక చేసుకోవచ్చు. వీటి కోణాలు పదునుగా ఉండవు.. దీంతో భద్రత ఉంటుంది.



# కారులో అవసరం లేని 5 ఫీచర్స్.. ధర కూడా తగ్గుతుంది!

కార్ల ధరలు ప్రధానంగా మీరు ఎంచుకునే ఫీచర్స్ మీద ఆధారపడి ఉంటాయి. మీరు సరిగ్గా గమనిస్తే.. బేస్ వేరియంట్ ధర ఒకలా ఉంటే, టాప్ వేరియంట్ ధర ఇంకోలా ఉంటుంది. చూడటానికి కారు ఒకేలా కనిపించినా.. బేస్ వేరియంట్ టాప్ వేరియంట్ ఫీచర్స్ వేరేలా ఉంటాయి. అంటే బేస్ వేరియంట్ లిమిటెడ్ ఫీచర్స్ పొందుతుంది. టాప్ వేరియంట్ ప్రీమియం ఫీచర్స్ లేదా అదనపు ఫీచర్స్ పొందుతుంది. ప్రస్తుతం కారు కొనుగోలు చేసే చాలామంది ఎక్కువ ఫీచర్స్ ఉన్న కార్లనే కొంటున్నారు. ఫీచర్స్ ఉన్న కార్లను కొంటున్నారు సరే.. ఉన్న ఫీచర్స్ ఉపయోగిస్తున్నారా.. అంటే?, లేదనే చెప్పాలి. అలాంటప్పుడు ఫీచర్స్ కోసం ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టడం కూడా వృధా. కాబట్టి ఈ కథనంలో ఫాఫాపు అవసరం లేని 5 ఫీచర్స్ గురించి తెలుసుకుందాం.

**బిల్ట్ నావిగేషన్ సిస్టమ్‌లు**

చాలా మంది డ్రైవర్లు గూగుల్ మ్యాప్స్ లేదా యాపిల్ మ్యాప్స్ ఉపయోగిస్తారు. అయితే వీటికంటే ఫోన్ నావిగేషన్ మరింత ఖచ్చితమైనది. అప్పటికప్పుడు అప్డేట్స్ పొందుతుంది.



**పవర్డ్ టెయిల్‌గేట్**

బటన్‌తో బూట్‌ను ఓపెన్ చేయడం అద్భుతంగా అనిపిస్తుంది. కానీ ఈ ఫీచర్ చిన్న కార్లలో అంత అవసరం లేదు. ఎందుకంటే ఇది చేతితో ఓపెన్ చేయడం కంటే నెమ్మదిగా ఉంటుంది. ఇది పెద్ద కార్లకు అనుకూలంగా ఉంటుంది.

**పనోరమిక్ సన్‌రూఫ్**

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న దాదాపు అన్ని కార్లలో ఈ పనోరమిక్ సన్‌రూఫ్ ఫీచర్ ఉంది. కానీ చాలామంది ఈ ఫీచర్ ఎక్కువగా ఉపయోగించరు. ఎక్కువ గాలి లేదా ఎండ వస్తుందని దాదాపు క్లోజ్ చేసి ఉంచుతారు.

**గెస్టర్ కంట్రోల్ సిస్టమ్స్**

గెస్టర్ కంట్రోల్ సిస్టమ్స్ అంటే మీ చేతిని ఊపి మ్యూజిక్ మార్చడం లాంటి ఫీచర్. మొదట చూడటానికి ఇది చాలా కూల్‌గా అనిపించవచ్చు, కానీ ఎక్కువసార్లు ఇవి సరిగ్గా పని చేయవు. కాబట్టి టచ్ కంట్రోల్ ఎంపిక చేసుకోవచ్చు. ఇది వేగంగా ఉంటుంది, నమ్మదగినదిగా ఉంటుంది.

**టచ్-ఓన్లీ క్లైమేట్ కంట్రోల్స్**


డ్రైవింగ్ చేస్తున్నప్పుడు స్క్రీన్ ద్వారా ACని అడ్జస్ట్ చేయడం చికాకును కలిగిస్తుంది. కాబట్టి ఫిజికల్ నాబ్‌లు సులభంగా ఉంటాయి. ప్రత్యేకించి దీనిపై శ్రద్ధ చూపాల్సిన అవసరం లేదు. ఒక కారును కొనుగోలు చేయాలనుకున్నప్పుడు అవసరమైన ఫీచర్స్ ఏవి కావాలి?, వాటిని ఎంతవరకు ఉపయోగిస్తాము అనే విషయాలను ముందుగానే ఆలోచించుకోవాలి. లేకుంటే మీకు అవసరం లేని ఫీచర్లకు కూడా ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ విషయంలో కొంత జాగ్రత్త తీసుకోవడం అవసరం.



# డిజిటల్ విప్లవం.. క్యాష్‌కు చెక్ యూపీఐదే హవా!

## రూపే డెబిట్ కార్డ్, యూపీఐ

**లావాదేవీలపై తాజా సామాజిక–ఆర్థిక ప్రభావ నివేదిక**
**గత ఎనిమిదేళ్లలో ఏకంగా 11 రెట్లు పెరిగిన డిజిటల్ లావాదేవీలు**
**బ్యాంకులకు, ఏటీఎంలకు వెళ్లే వారి సంఖ్య భారీగా క్షీణత**
**ఆన్‌లైన్ చెల్లింపులతో పెరిగిన చిరు వ్యాపారుల అమ్మకాలు**
**భారత జీడీపీకి 16.2 బిలియన్ డాలర్ల భారీ ఆర్థిక ఊతం**




**న్యూఢిల్లీ**: దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవం సామాన్యుడి జీవనశైలిని సమూలంగా మార్చేసింది. చిల్లర కష్టాలకు చెక్ పెడుతూ.. గల్లీ లోని కిరాణా షాపు నుంచి మల్టీప్లెక్స్‌ల వరకు ఎక్క డ చూసినా ఇప్పుడు 'స్కాన్ అండ్ పే' మంత్రమే మార్మోగుతోంది. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, రూపే డెబిట్ కార్డులు, తక్కువ-విలువ కలిగిన భీమ్-యూపీఐ లావాదేవీల వల్ల దేశంలో నగదు రహిత ఆర్థిక వ్యవస్థ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఈ మేరకు ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్), నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) సంయుక్తంగా విడుదల చేసిన 'సామాజిక-ఆర్థిక ప్రభావ విశ్లేషణ' నివేదికలో ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయి. ఈ అధ్యయనాన్ని ఇప్సోస్ సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించింది.

**యూపీఐ సంచలనం.. రికార్డుల మోత**

గత ఎనిమిదేళ్ల వ్యవధిలో దేశంలో డిజిటల్ లావాదేవీలు ఏకంగా 11 రెట్లు పెరిగాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 2,071 కోట్లుగా ఉన్న ఆన్‌లైన్ లావాదేవీల సంఖ్య 2024-25 నాటికి 22,831 కోట్లకు చేరింది. మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో ఒకప్పుడు కేవ లం 4 శాతంగా ఉన్న యూపీఐ వాటా.. ఇప్పుడు ఏకంగా 80 శాతానికి చేరుకుని అగ్రగామిగా నిలిచింది. పీర్-టు-మర్చంట్ అంటే వినియోగదారులు వ్యాపారులకు చేసే చెల్లింపుల్లో 26 రెట్ల భారీ వృద్ధి నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే రియల్-టైమ్ డిజిటల్ చెల్లింపుల్లో 49% వాటాతో మన దేశం గ్లోబల్ లీడర్‌గా కొనసాగుతోంది.

**తగ్గుముఖం పట్టిన ఏటీఎం క్యూలు**

దేశంలో యూపీఐ వాడకం విపరీతంగా పెరగడంతో జేబులో నగదు పెట్టుకుని తిరిగే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. నివేదిక ప్రకారం.. 59% మంది వినియోగదారులు, 57% మంది వ్యాపారులు తమ దైనందిన జీవితంలో నగదు వాడకం బాగా తగ్గిపోయిందని స్పష్టం చేశారు. నగదు డ్రా చేసేందుకు బ్యాంకులకు వెళ్లే వినియోగదారుల సంఖ్య 69% మేర తగ్గిపోగా, ఏటీఎంల నుంచి డబ్బు లు డ్రా చేయడం 62% మేర పడిపోయింది. వ్యాపారుల్లో ఏటీఎం విత్‌డ్రాలు 61% మేర తగ్గాయి.

**జీడీపీకి భారీ ఆర్థిక ఊతం**

నగదు నిర్వహణ ఖర్చులు తగ్గడం, డిజిటల్ లావాదేవీల్లో పారదర్శకత పెరగడం ద్వారా యూపీఐ ఏకంగా భారత జీడీపీకి (2022 సంవత్సరంలో) అదనంగా 16.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 1.3 లక్షల కోట్లు) జోడింపును అందించినట్లు ఈ నివేదిక వెల్లడించింది. లావాదేవీలపై అదనపు రుసుములు లేకపోవడం దీనికి ప్రధాన కారణంగా నిలిచింది.

**మారుమూల ప్రాంతాల్లోనూ మారుమోగుతున్న 'స్కాన్ అండ్ పే'**


డిజిటల్ చెల్లింపుల మద్దతు కేవలం మహానగరాలకే పరిమితం కాలేదు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, మారుమూల ప్రాంతాల్లోనూ యూపీఐ క్యూఆర్ కోడ్‌లు విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. వృద్ధి రేటును గమనిస్తే.. లక్షదీవుల్లో ఏకంగా 136%, మేఘాలయలో 83%, జమ్మూకాశ్మీర్‌లో 76% మేర యూపీఐ లావాదేవీల వృద్ధి నమోదైంది.

### వినియోగదారులు ఏమనుకుంటున్నారు?

**చాలా సులభంగా వాడుకునే వీలుండటం (63%), తక్షణమే ఇతరుల ఖాతాల్లోకి నగదు బదిలీ జరగడం (59%) వల్లే యూపీఐను ఎక్కువగా ఇష్టపడుతున్నట్లు వినియోగదారులు సర్వేలో తెలిపారు. క్యాష్‌బ్యాక్ ఆఫ ర్లు (52%), మెరుగైన ఇంటర్నెట్ సౌకర్యం (37%), మెరుగైన భద్రతా ఫీచర్లు (36%) లాంటివి డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని మరింతగా ప్రోత్సహిస్తున్నాయి. మరింత మందికి చేరువయ్యేందుకు స్థానిక భాష ల్లో యాప్స్ అందుబాటులో ఉండాలని 21% మంది అభిప్రాయపడ్డారు. ఒకప్పుడు నగదు కోసం ఏటీఎంలు, బ్యాంకుల చుట్టూ తిరిగిన సగటు భారతీయుడు.. ఇప్పుడు తన స్మార్ట్‌ఫోన్‌నే బ్యాంక్‌గా మా ర్చుకుని పారదర్శకమైన ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నాడని ఈ అధ్యయనం తేల్చిచెప్పింది.**


## మైనర్ బాలురపై లైంగిక దాడి..
# టీచర్‌కు 51 ఏళ్ల జైలు శిక్ష

అమెరికాలోని విస్కాన్సిన్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. మైనర్ బాలురపై లైంగిక వేధింపులకు పాల్పడిన మాజీ ఉపాధ్యాయురాలికి 51 ఏళ్ల జైలు శిక్ష విధించింది. కెనోషా కౌంటీలోని ఎలిమెంటరీ స్కూల్‌లో పనిచేసిన అన్న మేరీ క్రోకర్ (34) చిన్నారులను లైంగిక వేధింపులకు గురిచేసింది. ఆమె విద్యార్థులను ప్రలోభపెట్టడం, వారికి అశ్లీల సందేశాలు పంపడం వంటివి చేసేది. అంతేకాకుండా 12, 14 ఏళ్ల వయస్సు గల ఇద్దరు బాలురుపై ఆమె లైంగిక దాడులకు పాల్పడినట్లు రుజువైంది. పాఠశాల పరిసరాలు, విద్యార్థుల ఇళ్ల వద్ద కూడా ఆమె ఈ దారుణాలకు ఒడిగట్టింది. గతేడాది డిసెంబర్‌లోనే మేరీ క్రోకర్ తనపై ఉన్న నేరారోపణలను అంగీకరించింది. దీంతో కోర్టు తాజాగా ఆమెకు శిక్ష విధించింది. 34 ఏళ్ల వయస్సు ఉన్న క్రోకర్ తన 80వ ఏట వచ్చే వరకు జైలులోనే గడపనుంది. ఆమెకు నలుగురు పిల్లలు ఉండడం గమనార్హం. కాగా అమెరికాలో చైల్డ్ ప్రొటెక్షన్ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. అది మేరీ క్రోకర్ కేసు విషయంలో మరోసారి రుజువైంది.



# ఇరాన్ యూనివర్సిటీల్లో మళ్లీ నిరసన జ్వాలలు

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ పాలనకు వ్యతిరేకంగా విద్యార్థులు మరోసారి రోడ్లెక్కారు. శనివారం కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో అనేక విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు నిరసనలు తెలిపారు. గత నెలలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలో భద్రతా దళాల అణిచివేత కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరిస్తూ ఆందోళన చేపట్టారు. టెహ్రాన్‌లోని షరీఫ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలోని విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. అయతుల్లా అలీ ఖమేనీని " అత్యంత క్రూరమైన నాయకుడు" అని అభివర్ణిస్తూ నినాదాలు చేశారు. అదేవిధంగా ఇరాన్ మాజీ రాజు షా కుమారుడు రెజా పహ్లావిని కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టాలని విద్యార్థులు కోరడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో పలు క్యాంపస్‌లలో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. నిరసనకారులకు, ప్రభుత్వ మద్దతుదారులైన 'బసీజ్' (Basij) విద్యార్థి విభాగాలకు మధ్య పలు చోట్ల వాగ్వాదం జరిగింది. టెహ్రాన్‌లోని అమీర్ కబీర్, షాహిద్ బెహెష్తి యూనివర్సిటీలతో పాటు ఈశాన్య ప్రాంతంలోని మషద్ యూనివర్సిటీలో కూడా నిరసనలు జరిగాయి. కాగా 1979 నాటి ఇస్లామిక్ విప్లవం తర్వాత, ఇరాన్ ప్రభుత్వం ఇంతటి భారీ ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొవడం ఇదే మొదటిసారి. ఇరాన్ భద్రతా బలగాలు అణిచివేతలో వేల సంఖ్యలో నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు.



## యూఏఈ సంచలన నిర్ణయం..
# అనాథల కోసం రూ.225 కోట్లు



అనాథ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం యూఏఈ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. 'మదర్ ఆఫ్ ది నేషన్ ఎండోవ్‌మెంట్' కార్యక్రమానికి యూఏఈ శ్రీకారం చుట్టింది. అయితే ఈ ప్రాజెక్ట్ కోసం 'ఎర్త్ జాయెద్ ఫిలాంత్రోపీస్' (Erth Zayed Philanthropies) అనే సంస్థ 100 మిలియన్ దిర్హామ్‌ల (సుమారు రూ.225 కోట్లకు పైగా)ను విరాళంగా ప్రకటించింది. యూఏఈ వ్యవస్థాపక పితామహుడు షేక్ జాయెద్ బిన్ సుల్తాన్ అల్ నహ్యాన్ జ్ఞాపకార్థం ఈ 'ఎర్త్ జాయెద్ ఫిలాంత్రోపీస్' సంస్థను స్థాపించారు. అబుదాబీ కేంద్రంగా పనిచేసే ఈ ప్రభుత్వ సంస్థ.. యూఏఈ అంతర్జాతీయ మానవతా సాయం, స్వచ్ఛంద కార్యక్రమాలన్నింటినీ నిర్వహిస్తుంటుంది. ఈ సంస్థ చైర్మన్‌గా యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఉన్నారు. కాగా ఈ 100 మిలియన్ దిర్హామ్‌లను అబుదాబి అవ్కాఫ్ పర్యవేక్షణలో ప్రత్యేక పెట్టుబడి పథకాల్లో మదుపు చేస్తారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని యూఏఈలోని అనాథ పిల్లల విద్య, ఆరోగ్యం, వారి భవిష్యత్తు సాధికారత కోసం ఖర్చు చేయనున్నారు.

